
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people



డీఎంహెచ్ఓ వ్యవహారంపై

# నాయిని సీరియస్

- రంగంలోకి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన జేఏసీ ప్రతినిధులు

03

గురువారం, 2, జూలై 2026 సంపుటి : 03 సంచిక : 140 పేజీలు : 05 వెల ₹5



## సీపీని కలిసిన కలెక్టర్

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ శ్వేతను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయడానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## ప్రజల ముంగిట్లోకి అత్యాధునిక వైద్య సేవలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత 'ఎమ్మారై' సేవలు ప్రారంభం

05






అక్షరదర్బార్, హనుమకొండ:

విద్యుత్ వినియోగదారులకు మరింత సులభమైన, వేగవంతమైన, పారదర్శక సేవలను అందించాలనే లక్ష్యంతో టీజీఎన్పీడీసీఎల్ అపార్ట్మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు (మల్టీ స్టోరీడ్ బిల్డింగ్స్), వాణిజ్య సముదాయాల కోసం "బల్క్/ మల్టిపుల్ అప్లికేషన్స్ రిజిస్ట్రేషన్" విధానాన్ని అమలు చేస్తున్నట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ విధానం ద్వారా ఒకే భవనంలో అవసరమైన అన్ని విద్యుత్ కనెక్షన్ల కోసం విడివిడిగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా అన్ని కనెక్షన్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. దీంతో బిల్డర్లు, డెవలపర్లు, భవన యజమానులు, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్వాహకులు తక్కువ సమయంలో సులభంగా విద్యుత్ కనెక్షన్లు పొందవచ్చని పేర్కొన్నారు.

02

- టీజీఎన్పీడీసీఎల్ ప్రత్యేక 'బల్క్, మల్టిపుల్ అప్లికేషన్స్ రిజిస్ట్రేషన్' సౌకర్యం
- అపార్ట్మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలకూ
- వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శక సేవలు

# ఒకే దరఖాస్తుతో బహుళ విద్యుత్ కనెక్షన్లు



## ప్రతి మండలంలో జనరిక్ పశు ఔషధి కేంద్రం

- రైతులకు నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

05

## పెళ్లి ఇంట్లో తీరని విషాదం

- విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకుల దుర్మరణం
- బీమారంలో విషాదం

03

# ఒకే దరఖాస్తుతో బహుళ విద్యుత్ కనెక్షన్లు

- టీజీఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక 'బల్క్, మల్టిపుల్ అప్లికేషన్స్ రిజిస్ట్రేషన్' సౌకర్యం
- అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలకూ
- వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శక సేవలు



అక్షరదర్బార్, హనుమకొండ: విద్యుత్ వినియోగదారులకు మరింత సులభమైన, వేగవంతమైన, పారదర్శక సేవలను అందించాలనే లక్ష్యంతో టీజీఎన్‌పీడీసీఎల్ అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు (మల్టీ స్టోరీడ్ బిల్డింగ్స్), వాణిజ్య సముదాయాల కోసం "బల్క్/మల్టిపుల్ అప్లికేషన్స్ రిజిస్ట్రేషన్" విధానాన్ని అమలు చేస్తున్నట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ విధానం ద్వారా ఒకే భవనంలో అవసరమైన అన్ని విద్యుత్ కనెక్షన్ల కోసం విడివిడిగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా అన్ని కనెక్షన్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. దీంతో బిల్డర్లు, డెవలపర్లు, భవన యజమానులు, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్వాహకులు తక్కువ సమయంలో సులభంగా విద్యుత్ కనెక్షన్లు పొందవచ్చని పేర్కొన్నారు.

### వినియోగదారులకు ప్రధాన ప్రయోజనాలు..

ఒకే దరఖాస్తుతో బహుళ విద్యుత్ కనెక్షన్ల నమోదు.
దరఖాస్తుల పరిశీలన, అనుమతులు, కనెక్షన్ మంజూరు ప్రక్రియ వేగవంతం. సమయం, వ్యయం రెండింటిలోనూ ఆదా. పూర్తి పారదర్శకతతో లోడ్ ఆధారిత చార్జీల విధానం. కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ సేవలు. దరఖాస్తు స్థితిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం. అపార్ట్‌మెంట్ బిల్డర్లు, డెవలపర్లు, అపార్ట్‌మెంట్ యజమానులు, మల్టీ స్టోరీడ్ భవనాల యజమానులు, కమర్షియల్ కాంప్లెక్స్ డెవలపర్లు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు.

### ఆన్‌లైన్‌లోనే నమోదు

వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్ అధికారిక పోర్టల్ ద్వారా బల్క్/మల్టిపుల్ అప్లికేషన్స్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి కోరారు. ఈ విధానం ద్వారా విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ఆలస్యం తగ్గి అపార్ట్మెంట్, గృహ నిర్మాణ, వాణిజ్య రంగాలకు మరింత వేగవంతమైన సేవలు అందుతాయని తెలిపారు.

### ముఖ్యాంశాలు

అపార్ట్‌మెంట్లు, మల్టీ స్టోరీడ్ భవనాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లకు అవసరమైన బహుళ ఎల్టీ (కేటగిరీ-1,2) కనెక్షన్లకు ఈ విధానం వర్తిస్తుంది. మొత్తం కాంట్రాక్ట్ లోడ్ ఆధారంగా చార్జీలు నిర్ణయించబడతాయి. 20 కిలోవాట్ల వరకు- డెవలప్‌మెంట్ చార్జీలు, సర్వీస్ లైన్ చార్జీలు వర్తిస్తాయి. 20 కిలోవాట్లకు పైగా- కేవలం సర్వీస్ లైన్ చార్జీలు మాత్రమే వర్తిస్తాయి. (డెవలప్‌మెంట్ చార్జీలు ఉండవు). ఒక కిలో మీటర్ లోపు ఉన్న విద్యుదీకరణ ఉన్న నెట్వర్క్ నుండి ఓవర్ హెడ్ లైన్లకు మాత్రమే వర్తిస్తుంది. అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను డిస్కం వినియోగదారుడికి ఎటువంటి అదనపు వ్యయం లేకుండా ఏర్పాటు చేస్తుంది. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) రెగ్యులేషన్-01 ఆఫ్ 2026 ప్రకారం ఏకరీతి, పారదర్శక చార్జీలు అమలులో ఉంటాయి. బల్క్/మల్టిపుల్ అప్లికేషన్ నమోదు సమయంలోనే సర్వీస్ లైన్ చార్జీలను పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో దరఖాస్తు పరిశీలన అనంతరం కనెక్షన్ల మంజూరు ప్రక్రియ మరింత వేగంగా పూర్తవుతుంది.

వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, తదితర వివరాల కోసం 1912 లేదా 1800-425-0028 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించవచ్చని సీఎండీ సూచించారు.

# ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర అమూల్యం

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీలో ఘనంగా 'జాతీయ వైద్యుల దినోత్సవం'




అక్షరదర్బార్, హనుమకొండ: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ భవన్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రముఖ వైద్యుడు, భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతి-వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ సేవలు ప్రతి వైద్యునికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

### 'పునర్జన్మ'నిచ్చే దైవస్వరూపులు

రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, వైద్య రంగానికి డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను 'భారతరత్న' పురస్కారంతో సత్కరించిందని, ఆయన స్మారకార్థమే ప్రతి సంవత్సరం జూలై 1న ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. "అమ్మ మనకు జన్మనిస్తే, అనారోగ్య సమయంలో మన ప్రాణాలను కాపాడి పునర్జన్మను ప్రసాదించేవారు వైద్యులని అన్నారు.

### వైద్యులకు ఘన సన్మానం

వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో వైద్య రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖ వైద్యులను జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో డా ఎస్ డి రాంకుమార్ (హనుమకొండ డీఎంహెచ్ఓ), డా పి విజయచందర్ రెడ్డి (రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్), డా కె సుధాకర్ రెడ్డి, డా మాగంటి శేషుమాధవ్ (జిల్లా పాలకవర్గ సభ్యులు), డా పి కాళీప్రసాద్ రావు (ఆర్థోపెడిక్ సర్జన్), డా మన్మోహన్ రాజు (ఐఎంఏ అధ్యక్షులు), డా పి ప్రవీణ్ (ఐఎంఏ ప్రెసిడెంట్ ఎలెక్ట్, వరంగల్ క్లబ్ కార్యదర్శి), డా దిలీప్ కుమార్ (తానా అధ్యక్షులు), డా పి సుదీర్ కుమార్ (వరంగల్ క్లబ్ కోశాధికారి), డా బైరి లక్ష్మీనారాయణ (పిల్లల వైద్య నిపుణులు), డా జె కిషన్ రావు, డా టి మదన్ మోహన్ రావు, డా మొహమ్మద్ తహర్ మసూద్ (రెడ్ క్రాస్ వైద్యులు) ఉన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, రెడ్ క్రాస్ సిబ్బంది, పలువురు వైద్యులు పాల్గొన్నారు.



## టీచర్ గా మారి గణితం బోధించిన కలెక్టర్

- బ్లాక్‌బోర్డుపై చాక్ పీస్ పట్టి లెక్కలు నేర్పిన చాహత్ బాజ్ పాయి
- పంథిని ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

అక్షరదర్బార్, ఐనవోలు: ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలవాలని, విద్యార్థుల్లో పఠన సామర్థ్యం, గణిత నైపుణ్యాలు, ఆలోచనా శక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. బుధవారం ఐనవోలు మండలం పంథిని గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో కలెక్టర్ స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి ఐదో తరగతి విద్యార్థులకు గణిత పాఠ్యాంశాన్ని బోధించారు. ఒక చేత్తో గణిత పాఠ్యపుస్తకాన్ని పట్టుకొని, మరో చేత్తో చాక్ పీస్ చేత పట్టి బ్లాక్‌బోర్డుపై స్వయంగా లెక్కలు రాశారు. విద్యార్థులతో ఆ లెక్కలను సాధింపజేయడమే కాకుండా.. వారి అవగాహన, ప్రతిభ, నేర్చుకునే సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ తమకు సులువుగా అర్థమయ్యేలా పాఠం చెప్పడంతో విద్యార్థులు ఎంతో సంబరపడ్డారు.

### ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి ఆనందంతో కలెక్టర్ మాట్లాడారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రతి విద్యార్థి ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. "ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి" అని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణితంలో నైపుణ్యం సాధించేలా ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలని స్పష్టం చేశారు.

### అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

అనంతరం పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి వారి తల్లులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, బాలామృతం పంపిణీని పరిశీలించి స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాంభూపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా శిశు సంక్షేమ అధికారి విశ్వజ, తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, సంబంధిత అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీపీని కలిసిన కలెక్టర్

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ శ్వేతను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయడానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.



# విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

- కెరీర్ కౌన్సెలింగ్ నిర్వహించిన వరంగల్ సీఏ శాఖ ప్రతినిధులు

అక్షరదర్బార్, పరకాల : చార్టర్డ్ అకౌంటెంట్స్ డే (సీఏ డే) సందర్భంగా వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నడికూడ మండలం రాయపర్తి జెడ్పీ హైస్కూల్‌లో కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద కుటుంబాలకు చెందిన నలుగురు విద్యార్థినులకు సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరంగల్ బ్రాంచ్ చైర్మన్ సీఏ సుజిత్, వైస్ చైర్మన్ సీఏ వినీల్, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ సీఏ రాఘవరెడ్డి, చంచల్ అగ్రవాల్, సీఏ వంశీ, సీఏ యుగేందర్ చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉన్నత విద్య, చార్టర్డ్ అకౌంటెన్సీ కోర్సు అవకాశాలు, కెరీర్‌లో విజయానికి అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారు సూచించారు. సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నడికూడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పర్నం మల్లారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ డా. సత్య శారద

ఖానాపూర్, అక్షర దర్బార్ : మండలంలోని అశోక్‌నగర్, మనబోతుల తండాలోని జిల్లా పరిషత్, ప్రైమరీ, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అశోక్ నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, దీనిపై సంబంధిత జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూఓ) వివరణ ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేసి విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నాణ్యత, ప్రతిరోజూ అందుతున్న ఆహారంపై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్య ఉన్నట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కలెక్టర్ గారి దృష్టికి తీసుకురాగా, అట్టి సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు, నివేదికలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మనుబోతుల తండా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బెంచీల కొరతను గమనించిన కలెక్టర్, కేజీబీవీలలో అందుబాటులో ఉన్న బెంచీలను వెంటనే ఇక్కడికి తరలించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. మనుబోతుల తండా మహిళలు ఆర్టీసీ బస్సు కావాలని జిల్లా కలెక్టర్ గారిని కోరగా అందుకు జిల్లా కలెక్టర్ అనుకూలంగా స్పందించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఖానాపూర్ తాసిల్దార్ శ్రీనివాస్, డీఎస్ఓ శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపాల్స్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



# నర్సంపేటలో 'డాక్టర్స్ డే' వేడుకలు

- ప్రముఖ వైద్యులను ఘనంగా సత్కరించిన ఫిట్‌నెస్ గ్రూప్





నర్సంపేట, అక్షర దర్బార్ : నర్సంపేట పట్టణంలో బుధవారం ప్రపంచ వైద్యుల దినోత్సవ వేడుకలను నర్సంపేట ఫిట్నెస్ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేట పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులను ఫిట్నెస్ గ్రూప్ సభ్యులు శాలువాలతో సత్కరించి, బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సంపేట ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్. వి ఎం జేయుడు మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకి మెరుగైన కార్పోరేట్ వైద్యం అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తాము మారుమూల ప్రాంతంలో జన్మించి ఇక్కడి ప్రాంత ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా అతితక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యాన్ని అందించడంతో పాటు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున నిరుపేదలను గుర్తిస్తూ వారి ఆరోగ్యభావృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో నర్సంపేట పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ పొనుగోటి గోపాల్, డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ రాజేష్, డాక్టర్ రాజేష్, డాక్టర్ మనోజ్ లాల్‌లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు, నర్సంపేట మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి ప్రసాద్, బాలాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మోర్తాల రామరాజు, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, అక్షర దర్బార్ నర్సంపేట ఆర్సి ఇంచార్జ్ వంగాల ప్రేమ్ సాగర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కోరికల ప్రశాంత్, బొబ్బల కరుణాకర్ రెడ్డి, శ్రీనివాసరావు, మహేందర్ రావు, వీరభద్రరావు, మూడు కళ్యాణ్‌లతో పాటు, విద్యార్థి సంఘాల నాయకులు దిడ్డి పార్థసారధి, అజయ్, సాగర్, మార్త నాగరాజులతో పాటు పలువురు వైద్యుల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

# సమర్థవంతంగా పోలీసింగ్ శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత**





అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకు ప్రజలందరి సహకారం ఎంతో అవసరమని వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత అన్నారు. బుధవారం ఆమె వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఉదయం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్న నూతన సీపీకి సాయుధ పోలీసులు వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఛాంబర్ లో బదిలీపై వెళ్తున్న పూర్వ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నుంచి నూతన పోలీస్ కమిషనర్ శ్వేత సీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది నూతన పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, నోట్ బుక్‌లను సీపీకి అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తామని పోలీస్ కమిషనర్ అన్నారు.

# పెళ్లి ఇంట్లో తీరని విషాదం

- విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకుల దుర్మరణం
- బీమారంలో విషాదం

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండలోని భీమారంలో అత్యంత విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పెళ్లి వేడుకల సంబరాల్లో ఉన్న ఆ కుటుంబంలో విద్యుత్ రూపంలో వచ్చిన మృత్యువు తండ్రీకొడుకులను బలితీసుకుంది. ఇంటి అలంకరణ లైటింగ్‌ను పరిశీలిస్తుండగా జరిగిన ప్రమాదంలో నవవరుడు, ఆయన తండ్రి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఘటన వివరాల్లోకి వెళితే.. భీమారానికి చెందిన సాంబయ్య (62) కుమారుడు శరత్ (32) హైదరాబాద్‌లో చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ)గా పనిచేస్తున్నాడు. శరత్‌కు గత జూన్ 24వ తేదీన ఘనంగా వివాహం జరిగింది. పెళ్లి వేడుకలు ముగిసిన అనంతరం, బుధవారం రాత్రి ఇంటికి వేసిన అలంకరణ (సీరియల్) లైటింగ్‌ను తండ్రి సాంబయ్య పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ లైటింగ్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లు తగలడంతో సాంబయ్య తీవ్ర విద్యుదాఘాతానికి (షాక్) గురయ్యారు.

**తండ్రిని కాపాడబోయి..**

కళ్లెదుటే తండ్రి కరెంట్ షాక్‌తో విలవిలలాడుతుండటం చూసిన కుమారుడు శరత్.. ఎలాగైనా తండ్రిని రక్షించుకోవాలనే ఆరాటంతో ముందుకు ఉరికాడు. అయితే దురదృష్టవశాత్తూ శరత్‌కు కూడా బలమైన విద్యుత్ షాక్ తగలడంతో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పెళ్లయిన వారం రోజులు కూడా గడవక ముందే.. నవవరుడు శరత్‌తో పాటు తండ్రి సాంబయ్య మృతి చెందడంతో ఆ కుటుంబంలో ఒక్కసారిగా చీకట్లు ముసిరాయి. పెళ్లి సంబరాలతో కోలాహలంగా ఉన్న ఇల్లు.. కన్నీటి సముద్రంగా మారింది. ఈ ఘోర ప్రమాద వార్త తెలియగానే భీమారంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందగానే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# డీఎంహెచ్‌ఓ వ్యవహారంపై 'నాయిని' సీరియస్

- రంగంలోకి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన జేఏసీ ప్రతినిధులు





అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నెలకొన్న వివాదాస్పద పరిస్థితులపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తక్షణమే స్పందించారు. బుధవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీఎన్‌జీఓస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ నాయకత్వంలో జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి జిల్లా డీఎంహెచ్‌ఓ వ్యవహార శైలిపై వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శ్రద్ధగా ఆలకించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ఫోన్‌లో మాట్లాడారు. డీఎంహెచ్‌ఓ వ్యవహారంపై తగిన విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులకు విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 'ప్రభుత్వ ఉద్యోగులు పరస్పర గౌరవం, సానుకూల వాతావరణంలో విధులు నిర్వహించే పరిస్థితులు ఉండాలి. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధిగా ఎల్లప్పుడూ అండగా ఉంటాను. ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను.' అని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య కూడా పాల్గొన్నారు. డీఎంహెచ్‌ఓ వైఖరి వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతోనే ఎమ్మెల్యేను ఆశ్రయించామని జేఏసీ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు, ప్రభుత్వ వైద్యుల సంఘం (జీడీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కృష్ణా కృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రాజిరెడ్డి, ఏఓ కోలా రాజేష్, సీహెచ్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు నెహ్రూ చందు, యాదానాయక్, సుధాకర్‌తో పాటు టీఎన్‌జీఓ, టీజీఓ, జీడీఏ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఆరోగ్యశాఖ ఎస్సీ, ఎస్టీ సంఘాలు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 30 సీట్లు

### జూలై 4న స్పాట్ అడ్మిషన్లు

అక్షరదర్బార్, పరకాల : ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, పరకాలలో వివిధ బ్రాంచ్‌లలో ఖాళీగా ఉన్న 30 సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రవీందర్ రెడ్డి తెలిపారు. జూలై 1 నుంచి జూలై 3 సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలో దరఖాస్తులు స్వీకరిస్తామని, జూలై 4 ఉదయం 10.30 గంటలకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాలీసెట్–2026లో అర్హత సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత సాధించని అభ్యర్థులకు కూడా పదో తరగతి మార్కుల ఆధారంగా మిగిలిన సీట్లను కేటాయిస్తామని వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పాలీసెట్–2026 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి మెమో, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఎస్సీ/ఎస్టీ/బీసీ కుల ధ్రువీకరణ పత్రం (వర్తించిన వారికి), ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (ఒరిజినల్), ఆధార్ కార్డు, సంబంధిత జిరాక్స్ ప్రతులతో జూలై 3లోపు కళాశాలలో దరఖాస్తు చేయాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ పొందిన అభ్యర్థులు తమ కేటగిరీ ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పాలీసెట్ అర్హత పొందిన ఇతరులకు రూ.5,680, అర్హత పొందని ఎస్సీ/ఎస్టీలకు రూ.5,630, అర్హత పొందని ఇతరులకు రూ.6,100 ఫీజు వర్తిస్తుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సి. సునీల్ కుమార్ (99484 14210), పి. హర్ష (83281 69495)లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఎస్. రవీందర్ రెడ్డి సూచించారు.

## కొమురమ్మ కుటుంబానికి చైర్మన్ పరామర్శ

అక్షరదర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన గొడిశాల రమేష్, గొడిశాల రాజుల తల్లి గొడిశాల కొమురమ్మ ఇటీవల అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. చైర్మన్ వెంట మున్సిపల్ కౌన్సిలర్లు కొయ్యాడ శ్రీనివాస్, గూడెల్లి సదన్న, బండి శ్రీధర్, సుధమల్ల రమేష్, పరకాల పట్టణ అధ్యక్షుడు ఒంటేరు శ్రవణ్ కుమార్, ఏకు విద్యాసాగర్, మెరుగు శ్రీశైలం, బొచ్చు సాల్మన్, గడ్డం శివకుమార్, లడే శ్రీకాంత్, సుధమల్ల కిషోర్, ఎండీ తాజుద్దీన్ తదితరులు ఉన్నారు.



## టీబీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మహేష్

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన తుడుం మహేష్ సామాజిక సేవలను తెలంగాణ భూ రక్షణ సమితి (టీబీఆర్ఎస్) గుర్తించి ఆయనను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించింది. కాగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నత్తి కోర్నెల్ ఆయనకు నియామక పత్రంను అందజేశారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ టీబీఆర్ఎస్ కమిటీ ఇచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని క్రమశిక్షణతో విజయవంతం చేస్తానని తెలిపారు.



# వైద్య సేవలు ఆదర్శప్రాయం

- డాక్టర్స్ డే సందర్భంగా డా. సంతోష్ కుమార్‌కు ఘన సన్మానం

అక్షరదర్బార్, పరకాల: వైద్య వృత్తిని ఉపాధిగా కాకుండా సేవా ధర్మంగా భావిస్తూ ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తున్న డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ సేవలు ఆదర్శప్రాయమని పలువురు కొనియాడారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా పరకాల ప్రముఖ వైద్యులు, బీజేపీ రాష్ట్ర నాయకులు డా. సిరంగి సంతోష్ కుమార్‌ను బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ




ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నారని పేర్కొన్నారు. వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న ఆయన సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఇదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ప్రజలకు మరిన్ని ఆరోగ్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. జయంతిలాల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుక్కల విజయ్ కుమార్, కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్, బాసాని సోమరాజు, మెంతుల సురేష్, సూధమల్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలు ఇచ్చే దాకా పోరాటం ఆగదు

### వామపక్షాల ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ ముట్టడి




హనుమకొండ, అక్షర దర్బార్ : అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు పోరాటం ఆగదని సీపీఐ, ఎంసీపీఐ(యు), సీపీఎం జిల్లా నేతలు ఎండి భాషుమియా, పెద్దారపు రమేష్, సింగారపు బాబు హెచ్చరించారు. బుధవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములను రక్షించి గుడిసె వాసులకు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఏకశిలా పార్కు నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా, క్రయవిక్రయాలు జరుపుతున్నా పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం, పేదలు నిలువ నీడ కోసం 40, 50, 60 గజాలలో గుడిసెలు వేసుకుంటే మాత్రం కేసులు పెట్టి నిర్బంధాలను ప్రయోగించి గుడిసెలను తొలగించి నిరాశ్రయులు చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని అన్నారు. గత ప్రభుత్వం స్వరాష్ట్రం ఏర్పడితే పేదలందరికీ కూడు, గూడు, నీడ ఏర్పడుతుందని ఆశలు కల్పించి అమలు చేయలేదన్నారు. ఆ ప్రభుత్వాన్ని ఓడించి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెనెక్కిస్తే.. గత ప్రభుత్వం వలె ఈ ప్రభుత్వం కూడా పేదలపై జులుం ప్రదర్శిస్తుందని, ఇది అన్యాయం అన్నారు. ఇప్పటికైనా పేదలు వేసుకున్న గుడిసెలకు రక్షణ కల్పించి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, లేకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. అనంతరం జిల్లా డిఆర్ఓ శ్రీమతి విజయలక్ష్మి గారి ద్వారా కలెక్టర్కు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ(యూ), న్యూడెమోక్రసీ, లిబరేషన్ రాష్ట్ర జిల్లా నాయకులు చింతమల్ల రంగయ్య, మాలోత్ సాగర్, గంగుల దయాకర్, అక్కనపెల్లి యాదగిరి, రాచర్ల బాలరాజు, నర్ర ప్రతాప్, కన్నం వెంకన్న, ముక్కెర రామస్వామి, దండు లక్ష్మణ్, కనకం సంధ్య, సాంబమూర్తి, నలిగంటి రత్నమాల, ఆరూరి కుమార్, గణిపాక ఓదేలు, నరసయ్య తదితరులతోపాటు వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

## గోసంరక్షణకు ప్రభుత్వ భూమి కేటాయించాలి

### కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సొసైటీ వినతి

అక్షర దర్బార్ శాయంపేట : కొత్తగట్టు సింగారం గ్రామ శివారులో ప్రభుత్వం కొంత భూమిని శ్రీ రాజీవ్ దీక్షిత్ గోమాత సొసైటీ గోవుల సంరక్షణ ఏర్పాటుకు కేటాయించాలని కోరుతూ కార్యదర్శి మరియు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సొసైటీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ రాజీవ్ దీక్షిత్ గోమాత సొసైటీ (యాజమాన్యం) ప్రెసిడెంట్ మానుపాటి వేణు, వైస్ ప్రెసిడెంట్ పెంబర్తి హరీష్, మానుపాటి మల్లేష్ మాట్లాడుతూ.. గో సంరక్షణ మరియు ఆధారిత వ్యవసాయం, వర్మి కంపోస్టు లాంటి ఉత్పత్తుల తయారీ కొరకు ప్రభుత్వ అనుమతి పొందినామని, ఉత్పత్తుల కొరకై సంరక్షణ చేస్తున్నామని తెలిపారు. ఇందుకు గాను శ్రీ రాజీవ్ దీక్షిత్ గోమాత సొసైటీ 2023 సం॥లో రిజి.. నం. 471 సొసైటీగా ప్రభుత్వం ఆమోదం పొందినామని, గోసంరక్షణ కొరకై ఈ సొసైటీలో 10 గోమాతలను పోషిస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. ఇందుకు గాను గోసంరక్షణ, పోషణ మరియు నివాసం కొరకై గ్రామ శివారులో సాగులేని ప్రభుత్వం కొంత భూమిని శ్రీ రాజీవ్ దీక్షిత్ గోమాత సొసైటీ గోవుల సంరక్షణకు ఇవ్వగలరని కోరారు.



## కంకర రోడ్డు వేసి మూడేళ్లు.. పూర్తి ఎప్పుడు?

### కమిషనర్‌కు సీపీఎం వినతిపత్రం

అక్షరదర్బార్, పరకాల : పట్టణంలోని 22 వార్డులలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ, 2వ వార్డులో మూడేళ్ల క్రితం కంకర పోసి రహదారి పనులను మధ్యలోనే నిలిపివేశారని ఆరోపించారు. ఇప్పటికీ రోడ్డు పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే వార్డులో డ్రైనేజీ సౌకర్యం లేక వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించాలని, ముఖ్యంగా 2వ వార్డులో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొచ్చు ఈశ్వర్, బొజ్జ హేమంత్,



సన్నీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థిని హర్షితకు ఘన సత్కారం

### అవార్డు గ్రహీతను అభినందించిన పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్

అక్షర దర్బార్, ములుగు : ములుగు జిల్లా పీఎం శ్రీ టీజీఎంఎస్ బండారుపల్లి విద్యార్థిని పి. హర్షిత హైదరాబాద్‌లోని టీజీఐఆర్డీ, రాజేంద్రనగర్లో నిర్వహించిన తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ (టీఎంయూఎన్) కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రెస్ విభాగంలో స్పెషల్ అవార్డును అందుకొని పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ విశిష్ట విజయాన్ని గుర్తిస్తూ తెలంగాణ పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తన కార్యాలయంలో హర్షితను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. అనంతరం ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి హర్షితను అభినందించి, జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చినందుకు ప్రశంసించారు. అలాగే ఈ విజయానికి మార్గనిర్దేశనం చేసి, నిరంతరం ప్రోత్సహించిన పిఎం శ్రీ టీజీఎంఎస్ బండారుపల్లి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కె. సదానందం, మొహమ్మద్ అయాజ్ ఖాన్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘన విజయం పీఎం శ్రీ టీజీఎంఎస్ బండారుపల్లితో పాటు ములుగు జిల్లాకు గర్వకారణంగా నిలిచి, విద్యార్థులకు విద్యా, సహపాఠ్య కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడానికి స్ఫూర్తినిస్తుంది.

# ఓటర్ల జాబితా సవరణపై సందేహాల నివృత్తి

*** రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమావేశం**

అక్షర దర్బార్, మహబూబాబాద్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం అమలుపై వివిధ రాజకీయ పార్టీలకు ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష్ అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వి.సి. హాలులో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ SIR-2026 కార్యక్రమం షెడ్యూల్, ఇంటింటి సర్వే, ఫారాల స్వీకరణ, క్లెయిమ్స్ & అబ్జెక్షన్ల ప్రక్రియపై పార్టీల నాయకులు లేవనెత్తిన అంశాలకు సవివరంగా సమాధానం ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకరించాలని కోరారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ధృవీకరించి నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా నింపాలో వివరించే ట్యుటోరియల్ వీడియోలను సిద్ధం చేశామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి సందేహానికి సమాధానం ఇవ్వబడుతుందని తెలిపారు. దోషరహిత ఓటరు జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీల సహకారం తప్పనిసరి అని, సందేహాలుంటే నేరుగా తన దృష్టికి గానీ, ERO దృష్టికి గానీ తీసుకురావాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, పరిపాలన అధికారి పవన్ కుమార్, భారతీయ జనతా పార్టీ నుండి వేముల కోమల్ వెంకట్ రెడ్డి, శ్యాం సుందర్ శర్మ, సీతారాం నాయక్, కాంగ్రెస్ పార్టీ నుండి సురేష్ నాయుడు, బి.ఆర్.ఎస్ పార్టీ నుండి మార్నేని వెంకన్న, బి.ఎస్.పి పార్టీ నుండి విజయకాంత్, టి.డి.పి నుండి రామారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 'నక్ష' పనుల్లో నాణ్యత పాటించాలి

**అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశం**

అక్షర దర్బార్, మహబూబాబాద్ : జిల్లాలో అమలు అవుతున్న నక్ష కార్యక్రమం పురోగతిపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నక్ష కార్యక్రమం లక్ష్యాలు, క్షేత్రస్థాయిలో అమలు తీరు, ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరేలా పనిచేయాలని ఆదేశించారు. నక్ష కార్యక్రమం కింద మంజూరైన పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులు ప్రతి వారం క్షేత్ర సందర్శన చేసి పనుల పురోగతిని పరిశీలించాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఫైల్స్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. నక్ష కార్యక్రమం ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అధికారులు బాధ్యతతో పనిచేసి లక్ష్యాన్ని 100% చేరుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్వ్ సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, మహబూబాబాద్ మునిసిపల్ కమిషనర్ వినోద్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి మండలంలో జనరిక్ పశు ఔషధి కేంద్రం

- రైతులకు నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలో పశుపోషక రైతులకు నాణ్యమైన పశు ఔషధాలను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రతి మండలంలో ఒకటి, జిల్లా కేంద్రంలో ఒకటి చొప్పున జనరిక్ పశు ఔషధ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జనరిక్ పశు ఔషధ దుకాణాల ఏర్పాటుపై వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పశుపోషణ రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతున్న నేపథ్యంలో నాణ్యమైన పశు వైద్య సేవలు, తక్కువ ధరల్లో ఔషధాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

మార్కెట్‌లో లభించే అధిక ధరల మందులకు ప్రత్యామ్నాయంగా నాణ్యతలో రాజీ లేకుండా జనరిక్ పశు ఔషధాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారి వ్యయభారం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రతి మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖ సమన్వయంతో జనరిక్ పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో మాత్రం ఐనవోలు మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్పీఓ) ఆధ్వర్యంలో జనరిక్ పశు ఔషధ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ శ్రీను, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రాధకిషన్, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిట్లోకి అత్యాధునిక వైద్య సేవలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత 'ఎమ్మారై' సేవలు ప్రారంభం



అక్షరదర్బార్, భూపాలపల్లి: పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సరికొత్త అధ్యాయం మొదలైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఎస్ఆర్ నిధులతో ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎమ్మారై యంత్రాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంయుక్తంగా ప్రారంభించారు. కంప్యూటర్ స్విచ్ ఆన్ చేసి యంత్రాన్ని ప్రారంభించిన అనంతరం, వారు దాని పనితీరును నిశితంగా పరిశీలించారు.

### కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యం

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, మారుమూల జిల్లాగా ఉన్న భూపాలపల్లిలో అత్యాధునిక ఎమ్మారై సేవలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి వరంగల్, హైదరాబాద్ వంటి నగరాల్లో లభించే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఇక్కడి పేదలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది ఆస్పత్రిలో వెంటిలేటర్లు, సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభించామని గుర్తు చేశారు. ఆస్పత్రిని 100 పడకల నుంచి 300 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రూ.14కోట్ల వ్యయంతో నాలుగో అంతస్తు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. త్వరలోనే గుండె సంబంధిత చికిత్సల కోసం 'క్యాథ్ ల్యాబ్' ఏర్పాటు చేయడమే తదుపరి లక్ష్యమని అన్నారు.

### సరిహద్దు రాష్ట్రాల రోగులకూ వరం

భూపాలపల్లి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిపై ఆధారపడి మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేలాది రూపాయల ఖర్చయ్యే సీటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ సేవలను ఇక్కడ పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, "డాక్టర్స్ ఫర్ యూ" సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

### సమయం, ఖర్చు రెండూ ఆదా

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంజీఎం ఆసుపత్రి తర్వాత, ప్రభుత్వ రంగంలో ఎమ్మారై యంత్రాన్ని ఏర్పాటు చేసిన రెండో ఆసుపత్రిగా భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిలవడం గర్వకారణమన్నారు.

### దాతలకు ఘన సత్కారం

ఆస్పత్రికి ఎమ్మారై యంత్రాన్ని విరాళంగా అందించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ రాజేష్, ఆసుపత్రి వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు లాభదాయక వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

## కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశం

అక్షర దర్బార్, మహబూబాబాద్ : లాభదాయక వ్యవసాయ విధానాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో పంట మార్పిడిపై శాస్త్రవేత్తలు మరియు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన పంటలైన కోకో, కొబ్బరి, వక్క, నిమ్మగడ్డి, సిట్రోనెల్ల, పామరోసా, జేరేనియం పంటలతో పాటు నిత్యం అవసరమైన కూరగాయల సాగును రైతులతో, స్వయం సహాయ సంఘాలతో చేయించేలా అవగాహన కల్పించాలన్నారు. వీటికి అన్ని రకాల రాయితీలు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఔషధ మొక్కల సాగుకు సంబంధించి కంపెనీలతో, స్వయం సహాయ సంఘాలతో అనుసంధానం చేయాలని తెలిపారు. అన్ని రకాల కూరగాయల సాగును పైలట్ ప్రాజెక్ట్ ద్వారా చేపట్టి, ప్రభుత్వ వసతి గృహాలకు తాజా కూరగాయలు సరఫరా అయ్యేవిధంగా స్వయం సహాయ సంఘాలను ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి గ్రామంలో 50 ఎకరాలలో మార్కెట్ డిమాండ్ ఉన్న అన్ని రకాల కూరగాయలు, ఆయిల్ పామ్, నూనె గింజలు, చిరు ధాన్యాలు, అపరాలు మొదలైన రోజువారీ అవసరమైన పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ 'ఔషధ మరియు సుగంధ పంటల సాగులో మెళుకువలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త (ములుగు, సిద్దిపేట జిల్లా) డా. వి. కృష్ణవేణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జి. మధుసూదన్ రాజు, జిల్లా ఉద్యాన అధికారి జినగు మరియన్న, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి కె. శ్రీనివాస్, మల్యాల ఉద్యాన పరిశోధన స్థానం హెడ్ డా. ప్రశాంత్, ఉద్యాన అధికారి ఎ. జె. శాంతి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.